క్లుప్తంగా

రేపు హుండీ లెక్కింపు

పాలకుర్తిటౌన్: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం రేపు (శనివారం) నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు గురువారం తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయంలోని కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి లెక్కింపు జరగనుందని పేర్కొన్నారు.

వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భాస్కర్



నియామక పత్రం అందుకుంటున్న భాస్కర్

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కావటి భాస్కర్‌యాదవ్ రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి(వైహెచ్‌పీఎస్) ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో భాస్కర్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ యాదవ కులస్తుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో యాదవ హక్కుల కోసం పోరాడే బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు వంశీమోహన్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్‌యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన భాస్కర్‌యాదవ్‌ను గురువారం మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద రమేష్, నామాల బుచ్చయ్య, తోటకూరి రమేశ్, చెంచు రమేశ్, పెండ్లి మల్లారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఫిబ్రవరి 24, 25వ తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ గురువారం ఆవిష్కరించారు. ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఇన్ యానిమల్ బయో టెక్నాలజీ అండ్ ఇమ్యునాలజీ ఫర్ డిసీస్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య వివరించారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారితోపాటు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

తొర్రూరు: రైతాంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు, జాటోత్ భిక్షపతిలు అన్నారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) కొత్తగూడెంలో జరిగే రైతుకూలీ సదస్సు కరపత్రాలను గురువారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు భూముల పట్టాలు రాక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కృష్ణ, సురేష్, యుగేందర్, నర్సింహులు, మల్లేష్, వెంకటయ్య, ఐలయ్య, వెంకన్నలు పాల్గొన్నారు.

పిట్టలోనిగూడెంలో తాగునీటికి తిప్పలు

- ఎండిపోయిన పాఠశాల బోరు
- నాలుగైదు రోజులకోసారి భగీరథ నీరు
- ఆన్ ఆఫ్‌లు లేని నల్లాలతో మరింత ఇబ్బందులు



బోరు ఎండిపోవడంతో వృథాగా ఉన్న మినీ ట్యాంక్

లింగాలఘణపురం: మండలంలోని పిట్టలోనిగూడెంలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. 70 నుంచి 80 కుటుంబాలు ఉన్న గూడెంలో ప్రస్తుతం 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరికి పాఠశాల ఆవరణలో ఉన్న బోరుతో నిత్యం తాగునీరుగా ఉపయోగించుకొనేవారు. ఇటీవల ఆ బోరు ఎండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ట్యాంక్ ఉన్నప్పటికీ నాలుగైదు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయని, అవి కూడా రోజు ఫోన్ చేస్తేకాని రావడంలేదని కాలనీవాసులంటున్నారు. ఇదిలా ఉండగా పిట్టలోనిగూడెంలో ఉన్న మిషన్ భగీరథ నల్లాలన్నింటికీ ఆన్ ఆఫ్‌లు లేకపోవడంతో ట్యాంక్‌లో నీరు ఉన్నంత సేపు రావడం ఆ సమయంలో వాటిని నిల్వ చేసుకొనేందుకు ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో ప్రతి రోజు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వారికి అవగాహన కల్పించి ఆన్ ఆఫ్‌లు ఏర్పాటు చేసుకొనే విధంగా చూస్తే ఇబ్బందులు ఉండవు. అంతా ఆన్ ఆఫ్‌లు తీసివేయడంతో వచ్చినప్పుడు వృథాగా పోతున్నాయి. దీంతో రోజు వ్యవసాయ బావుల వద్దకు వెళ్తే రైతులు వద్దంటున్నారని, దీంతో తాగునీటికి కష్టాలొచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పాఠశాల ఆవరణలో ఉన్న బోరు ఎండిపోవడంతో కష్టాలొచ్చాయంటున్నారు. అధికారులు స్పందించిన ప్రతి రోజు మిషన్ భగీరథ నీళ్లు వచ్చే విధంగా చూడడమే కాకుండా నల్లాలకు ఆన్ ఆఫ్‌లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నాలుగైదు రోజులకోసారి..



మిషన్ భగీరథ నీళ్లు నాలుగైదు రోజులకోసారి వస్తున్నాయి. బడిలో ఉన్న బోరు ఎండిపోయింది. దీంతో తాగునీటికి కష్టమొచ్చింది. బావుల వద్దకు వెళ్తే తిడుతున్నారు. రోజూ నీళ్లు వచ్చే విధంగా చూడాలి.

– రామక్క, పిట్టలోనిగూడెం

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

సీపీఎం నాయకుల డిమాండ్

జనగామ రూరల్: జనగామలోని బాణాపురం ఇందిరమ్మ కాలనీ వద్ద బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ బాణాపురం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కలెక్టర్ జోక్యం చేసుకుని అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. లేని పక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ధర్నాలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి, విజేందర్, ఉపేందర్, నరేందర్, గణేష్, కల్యాణి, ప్రశాంత్, శ్రావణ్, అంజమ్మ, సౌందర్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు దినచర్యలో భాగం కావాలి

డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి



బహుమతులు ప్రదానం చేస్తున్న నర్సింహారెడ్డి

నర్మెట: క్రీడలు దినచర్యలో భాగంగ కావాలని, దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్నిస్తాయని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మూడు రోజులుగా స్థానిక మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారం ముగియడంతో విజేతలకు నగదుతోపాటు షీల్డ్ బహుమతులు ప్రదానం చేశారు. ఎల్లమ్మ బజార్ బి టీంకు ప్రథమ బహుమతి రూ. 5వేలు, ఎల్లమ్మ బజార్ ఏ టీంకు ద్వితీయ బహుమతి రూ. 3వేలు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు చెవుల పరశురాములు, కన్నెబోయిన రామకృష్ణ, కల్యాణం మురళి, బండి అశోక్, ప్రజ్ఞాపురం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాథ కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకుడు

జఫర్‌గఢ్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి కొండ దిగువన ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కనులపండువగా సాగిన కల్యాణాన్ని భక్తులు తిలకించారు. అనంతరం స్వామివారికి భక్తులు మొక్కులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటచార్యులు, కృష్ణమాచార్యుల, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



రైతులకు మందులు అందజేస్తున్న డాక్టర్

జనగామ రూరల్: మండలంలోని అడవి కేశ్వాపురంలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్యులు గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స చేసి రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జయపాల్‌రెడ్డి, రాజయ్య, అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



నర్మెట: సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్



స్టేషన్‌ఘన్‌పూర్: సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

నర్మెట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అన్నారు. కన్నెబోయినగూడెం, వెల్దండ, అమ్మాపురంలలో నిర్వహిస్తున్న సర్వే సరళిని గురువారం ఆకస్మికంగా పరిశీలించిన ఆయన అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. అనంతరం వెల్దండలోని గుడ్ షెపర్డ్ స్కూల్, రైస్‌మిల్లు, పెట్రోల్ బంక్‌లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు, ఎంపీడీఓ అరవింద్ చౌదరి, సీనియర్ అసిస్టెంట్ కలాటి యాదయ్య, పంచాయతీ కార్యదర్శులు అనిల్, వినయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను బాధ్యతగా చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో అధికారులు సర్వేను బాధ్యతగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) రోహిత్‌సింగ్ అన్నారు. ఆయా పథకాలకు సంబంధించి స్టేషన్ ఘన్‌పూర్, విశ్వనాథపురం, రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి, రఘునాథపల్లిలో గ్రామాల్లో చేపడుతున్న సర్వేను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేపడుతున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. సర్వేను పారదర్శంగా, బాధ్యతగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులకు న్యాయం జరిగేలా సర్వే చేపట్టాలని, సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, మోహిన్సీముజ్జబ, ఆర్‌ఐ కొలిపాక శ్రీకాంత్, ఎంపీడీఓ విజయశ్రీ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

జఫర్‌గఢ్: అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జెడ్పీ సీఈఓ మాధురి కిరణ్‌చంద్రషా అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సర్వేను జెడ్పీ సీఈఓ పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వై రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు

జనగామ రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. మండలంలోని శామీర్‌పేటలో నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎస్ఓ సరస్వతి అన్నారు. మండలంలోని కొడవటూర్‌లో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్, ఆర్‌ఐ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి బ్బంగి రూపాచైతన్య, వీఓఏ గంగం వాణి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

చిల్పూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 20వ తేదీ వరకు నాలుగు అంశాలపై అధికారులు నిర్వహించే సర్వేకు ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతులు సహకరించాలని ఆర్డీఓ వెంకన్న అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, ఎంపీఓ మధుసూదన్, సీనియర్ అసిస్టెంట్ కల్వల శ్రీనివాస్, ఆర్‌ఐ రామారావు, ఏఓ నజీరుద్దీన్, ఏఈఓలు వినయ్, నర్సింహులు, యాకూబ్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సర్వే ప్రారంభం

కొడకండ్ల: సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందు కోసం మండలంలో అధికారులు సర్వేను ప్రారంభించారు. హక్యాతండలో తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఏఈఓ కొంగ నవ్య, ఆర్‌ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ ఆధ్వర్యంలో అర్హులైన రేషన్‌కార్డు లబ్ధిదారులతో పాటు వ్యవసాయ యోగ్యం కాని భూములపై సర్వే నిర్వహించారు. ఈ సర్వే 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నామని, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



జనగామ: ఆర్థికసాయం అందజేస్తున్న ప్రతినిధులు



నర్మెట: నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు

జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డకు చెందిన నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన బజ్జూరి సరోజన గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, ఐవీఎఫ్ జిల్లా గ్రూప్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల సహకారంతో అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి రూ.25వేలు అందజేశారు. అంతకు ముందు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ కుమార్ గుప్తా, కార్యదర్శి శర్విరాల ఉపేందర్, కోశాధికారి రాపాక విజయ్, లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ డైమండ్స్ అధ్యక్షుడు గొడిశాల శివరామకృష్ణ, ఐవీఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి గట్టు శ్రీని వాస్, సలహాదారులు మాశెట్టి వెంకన్న, యువజన విభాగం నాయకులు నాగమళ్ల సంతోష్, కొత్తపెల్లి దనసాగర్, కొత్తపల్లి సుధాకర్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

నర్మెట: మండల కేంద్రానికి చెందిన కూకట్ల కొమురమ్మ (80), బొమ్మెర లక్ష్మయ్య(70), గద్దం వెంకటయ్య (72) ఇటీవల మృతిచెందగా, పిన్నోజు సౌజన్య (33) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీటీసీ కల్యాణం మురళి, వలబోజు శ్రీనివాస్, ప్రజ్ఞాపురం శ్రీధర్, రమణాచారీ, కొమురయ్య, మండల నాయకులు మల్లయ్య, రామచంద్రునాయక్‌తోపాటు తదితరులు ఉన్నారు.



దేవరుప్పుల: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

పలు గ్రామాల్లో..

దేవరుప్పుల: మండలంలోని కడవెండి, చౌడూరు, అప్పిరెడ్డిపల్లెలో పలువురు మృతుల కుటుంబాలను నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, మహిళ విభాగం నాయకురాలు బాగాల మాలతి, ఎస్సీ, సెల్ మండల అధ్యక్షులు నాగరాజు, గణేష్, ఆయా గ్రామాల పార్టీల అధ్యక్షుడు రాంబాబు, దేవులపల్లి భాగ్యలక్ష్మి, కొన్నె తిరుపతి, పులి రేణుక, పల్లె ప్రభుదాస్, అన్నాదాస్, శివరాత్రి మహేష్, గొట్టి రాజశేఖర్, చెవుల పరశురాములు, సంగి మల్లేషం, కనకయ్య, అంజనేయులు తదితరులు ఉన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: కాంగ్రెస్ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకొంటూ కంటికి రెప్పలా కాపాడుకొంటామని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం ఇటీవల వివిధ గ్రామాల్లో మృతి చెందిన గొడుగు శ్రీనివాస్, లాలునాయక్, కొండయ్య, సాయిలు, యాదమ్మ, కొండయ్య కుటుంబసభ్యులతో పాటు ప్రమాదావశాత్తు గాయపడిన మొండ్రాయి గ్రామానికి చెందిన ఉప్పలయ్యలను ఆమె పరామర్శించింది. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, యాకయ్య, యాకేష్‌యాదవ్, నాగరాజు, క్రాంతి, రమేశ్ ఉన్నారు.

వెంకటేశ్వరపల్లెలో..

చిల్పూరు: మండలంలోని వెంకటేశ్వరపల్లె బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తోకల గోపాల్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కృష్ణారెడ్డి, మండల నాయకుడు జనగాం యాదగిరి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కాజీపేట రూరల్: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో మేలు చేస్తాయని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి.వీరన్న, రైల్వే ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ ఆర్.రమేశ్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడతూ రిపబ్లిక్ డేను పురస్కరించుకొని ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌కు కాజీపేట, వరంగల్, బెల్లంపల్లి, డోర్నకల్, కొండపల్లి, భద్రాచలం, ఆలేరు, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి మొత్తం 21 జట్లు పాల్గొన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, కల్చరల్ విభాగాల ఇన్‌చార్జ్ ధావత్ రఘు, క్రికెట్ క్రీడల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, కమిటీ సభ్యులు ఎస్.ప్రవీణ్, పి.రవికిరణ్, ప్రశాంత్, రైల్వే నాయకులు పి.అనిల్ కుమార్, కంచు రాజు, ఎ.అశోక్ పాల్గొన్నారు.

మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ



ఐనవోలు దేవస్థానంలో పట్టువస్త్రాలతో కూనూర్ గ్రామస్తులు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

జఫర్‌గఢ్: ఉమామహేశ్వర, భక్త ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మధుశర్మ, సదాశివుడు నేతృత్వాన మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన ప్రముఖులు, భక్తులు, గ్రామస్తులు ఐనవోలు మల్లికార్జునస్వామికి గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. గ్రామస్తులు ప్రతీ ఏటా సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఐనవోలు మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గ్రామస్తులు స్వామివారికి దాత ఈగ కృష్ణమూర్తి కుతూరు, అల్లుడు అందించిన పట్టువస్త్రాలు సమర్పించేందుకు బ్యాండు వాయిద్యాలు, డీజే సౌండ్స్ మధ్య ఊరేగింపుగా బయలుదేరారు. అనంతరం పలు వాహనాల్లో ఐనవోలు దేవస్థానానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి దీవెనలు అందుకున్నారు.

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న చైర్మన్ రామచంద్రయ్య

తొర్రూరు : తొర్రూరు పట్టణ అభివృద్ధికి స్థానికులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 56 అంశాలపై చర్చ జరగగా పలు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ తొర్రూరు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని, దానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారం అందిస్తారన్నారు. పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ శాంతికుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, ఏతః రంజిత్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోండి



సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులు

తొర్రూరు : తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 19న మహబూబాబాద్‌లో ఆత్మగౌరవ యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కొండా వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు అనపురం వెంకన్న, నాయకులు గుద్దేటి మల్లయ్య, నరసింహారెడ్డి, తాళ్ల మల్లయ్య, మన్నెం వెంకన్న పాల్గొన్నారు.